# దైవాధీనపు జీవితం

**మా** బావ వెంకటేశ్వర్లు జీవితంతో చెమటలు కక్కుతూ పోరాడటం అందరికీ కనిపిస్తుంది. కొందరు జీవితంతో నిశ్శబ్దంగా పోట్లాడతారు. కొందరు జీవితంతో ఆటాడే ఛాంపియన్లలాగా కనిపిస్తారు. మరికొందరు ఒడుపుగా వేటాడుతారు. ఇంకా కొందరు నిర్లక్ష్యంగా కూర్చుంటే జీవితమేవచ్చి వరమాలలు వేస్తుంది. (ఇవి నాలుగు కేరట్ల 'పసిడి పలుకులు'. వీటికి కథకూ ఏమీ సంబంధం లేదు.)

మా నాయనమ్మ కూర్చున్న పీటమీదినుండి లేచినట్టు కనబడకుండా పన్నెండు మందికి వంటచేసేది. వంట ఎప్పుడారంభమయిందీ, ఎప్పుడు ముగిసిందీ తెలిసేదే కాదు. మా అమ్మ వంట ప్రారంభించటానికి ముందు, సినిమాలలో టైటిల్స్ మ్యూజిక్ లాగా పెద్ద ఆర్భాటం మొదలవుతుంది. అయిపోవచ్చే సమయానికి చెడ్డ క్లయిమాక్స్ అంతా ఉండేది. అయిదుగురమూ, వోటు తీసుకుంటే అయిదుగురికి అయిదుగురమూ కూర్చున్నప్పుడు నాకు 'జనగణమన' లీలగా వినిపించినట్టుంటుంది. (ఇది శుద్ధ డైగ్రెషన్. దీనిక్కూడా కథతో సంబంధం లేదు)

మా వెంకటేశ్వర్లు బావ అత్తగారి పోలిక – అంటే మా అమ్మ పోలిక. అతని జీవితంలో బాక్‌గ్రౌండు ఎఫెక్ట్సు కొంచెం మోతాదుమించి ఉంటాయి. తనకున్నది నాలుగెకరాలభూమీ, ఆరుగురు పిల్లలూ, ఒక ఎలిమెంటరీ స్కూలూనూ. నాలుగెకరాల భూమి ఒకటే రాబడి గలది; మిగతా రెండూ ఖర్చు పద్దులే.

ముగ్గురు పిల్లలు పుట్టాక ఇక హాల్ట్‌పెట్టమని మా బావకు చెప్పి చూశాను. వింటాడని కాదు – నా తప్పులేకుండా చెప్పానన్న ఆత్మ సంతృప్తి కోసం. చెమటోడ్చటంలో ఆసక్తిగలవాడు భారం తగ్గించేపద్ధతులను తప్పక ఆక్షేపిస్తాడు.

దేన్నయినా ఆక్షేపించవచ్చు. ప్రపంచంలోగల ప్రతి మానవ విశ్వాసానికీ వ్యతిరేకంగా మరొక మానవ విశ్వాసం ఉండనేవుంది, సైన్సులో కూడా. విశ్వాసాలు ఇంద్రియగ్రాహ్యంకన్న కూడా బలీయమైనవి గదా! (మరికొన్ని పసిడి పలుకులు – కాని కథకు అప్రస్తుతం కావు.)

కాని విశ్వాసాల సమర్థింపు విశ్వసనీయంగా ఉండాలి. (ప.ప.?) పిల్లలను కనడం

ఆపుచెయ్యరాదని నన్ను ఒప్పించడానికి చెప్పిన కారణాలు పరస్పర సంబంధం గలవి కావు. అవి ఇలా ఉన్నాయి:

పిల్లలు కావాలంటే పుడతారుట్రా, వెధవా? దేవుడివ్వాలి. క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి. మర్త్యలోకం విశంతిగాళ్ళు తన కడుపున (అంటే, ఆరోగ్యం కోల్పోయి, కాల్షియం డెఫిషన్సీతో బాధపడే మా అక్క కడుపున) పుట్టుకురావలసి ఉంటే ఆపడం నీ తరమా, నా తరమా? బిడ్డలో అని మొత్తుకునేవాళ్ళకు పుట్టరేం?

ఇద్దరాడపిల్లలూ, ఒక మగపిల్లవాడూ పుట్టారు గదా. ఆడముండల మెజారిటీ ఎక్కువ కాలా? ఇద్దరు మగపిల్లల తరవాత ఒక ఆడపక్షి పుట్టినా నువ్వన్నట్టు హోల్ట్ పెట్టెయ్యొచ్చు. బాలెన్స్ షీట్ ఫేవర్‌బుల్‌గా ఉంటుంది. కాని వ్యాపారం నష్టంలో ఉండగా ఎలా ఆపటం?

ఈ గర్భనిరోధక విధానాలున్నాయి చూశావూ? అవీ ఖర్చుతో కూడినవే. లెక్కేసి చూశాగా! ఓ విధంగా పిల్లలే చౌక. మరోటేమిటంటే, అవి నమ్మకంగా పనిచెయ్యవు. మా వూళ్ళో లక్ష్మీ నారాయణ లేడూ....

అన్ని వాదనలూ విని 'ఆపరేషన్ చేయించుకుంటే?' అన్నాను.

మా బావ నా కేసి కోపంగా చూసి, 'ఇంకా నయం!' అన్నాడు. అంటే ఆయన ఉద్దేశం నాకర్థంకాలేదు. ఆపరేషన్లు చేయించుకున్న వాళ్ళు నా ఎరికిన కనీసం అరడజనుమంది ఉన్నారు. వాళ్ళు పెళ్లాలతో నిశ్చింతగా సుఖపడుతున్నారు.

ఇంకోరు చెప్పేది వినకపోవడమేకాకుండా ఇంకోరు విననిది చెప్పడంకూడా మా వెంకటేశ్వర్లు బావకు పరిపాటే.

ఎందుకో చెప్పలేనుగాని, కొందరు సుమతీశతకం పద్యాలు చదివినా ఆలకించబుద్ధి అవుతుంది; మనకు తెలిసిన విషయాలే చెబుతున్నా అందులో ఏదో కొత్త సత్యం ఉన్నట్టు అనిపిస్తుంది. మరికొందరు ఎంత పనికివచ్చే మాటలు చెప్పినా వినబుద్ధి పుట్టదు. లోపం వాళ్ళు చెప్పే తీరులోనో, ఆ చెప్పడం వెనకవుండే మనస్తత్వంలోనో ఉంటుందనుకుంటాను.

మా బావ జీవితపోరాటంలో కొండలకు వెంట్రుకలు కట్టే ధోరణి తరచు ప్రదర్శించేవాడు. కొండలకి వెంట్రుకలు కట్టటమనేది కడుపు నిండినవాళ్ళు చేసేపని. జీవితంలో జూదమాడటం కూడా ధనికుల వ్యాపకం. మా బావలాటి వాళ్ళకు తగినదికాదు.

ఆయనకున్నది నాలుగెకరాలు. ఆ నాలుగెకరాల్లోనూ పధ్నాలుగు రకాల పంటలు వేసి రెండుచేతులా వేలకువేలు సంపాదించడానికి పథకాలు వేసి కలలు కనడమేగాక, వాటిని వివరంగా అందరికీ చెప్పేవారు.

'ఒరే, చెరుకువేస్తే ఎంత లాభమనుకున్నావ్?.... పొరపాటైపోయింది గదరా! దొర

పొగాకు వేసివుంటే... ఒరే, మా వూరి మునసబు అల్లుడు కడపలో బత్తాయి తోటలు వేసి లాభం చేస్తున్నాట్ట గదా....! అన్నట్టు, ఈ అనభిషాహీ ద్రాక్షగురించి నీకేమన్నా తెలుసా!.. కనకాంబరం పూలసంగతి విన్నావూ? అరెకరం తోటమీద రోజుకు ఇరవై రూపాయలొస్తాయంటున్నారే? రోజు కిరవయ్యయితే నెల కెంతయిందీ? పోనీ అందులోనే సహం చూసుకున్నా... అసలు వెయ్యాలిసింది నిమ్మతోటరా, వొరే! ఏడాదికి ఎకరానికి ఎనిమిదివేలు లాభంరాని నిమ్మతోట వొట్టి వెధవ తోటట!....'

ఇదీ వరస. ఒకసారి బంగాళా దుంప. ఒకసారి కాబేజీ లేక కాలీఫ్లవర్, ఒకసారి బుంగమిరప, ఇదంతా ఏమిట్రా? ఉత్త ఆవాలు చల్లితే ఎంతలాభమో తెలుసా? చేసేది ఏమీలేదు... విత్తులు చల్లు, పంట నల్చుకో. మరోసారి జీడిమామిళ్ళు........ గవర్నమెంటు సబ్సిడీతో మరీనూ........

భూమిని కొంచెం కూడా మార్చకుండా మా బావ ఆ నాలుగెకరాల్లో అన్ని రకాల పంటలూ పండించాడు - మానసికంగా లక్షలు గడించాడు. అదీ మానసికంగానే మరి - వాస్తవంగా సాధించిన దేమంటే, ఆరుగురు పిల్లలూ, అంతకంతకూ పెరిగి పోతూన్న దారిద్ర్యమూనూ.

ఈ పంటల కలలు అలా ఉండగానే, భద్రాచలం ప్రాంతాల్లోనూ, మంజూరుగాని ప్రాజెక్టుల కిందా కారుచవగ్గా వందలేసి ఎకరాలు కొని కళ్ళు చెదిరే సేద్యం చేశాడు - మానసికంగానే.

కొంతకాలమయాక ప్రాజెక్టులకు సంబంధం లేనిచోట్ల వందలకొద్దీ ఎకరాలు కొనడం గురించి కలలు ప్రారంభించాడు. ఎందుకని అడగండి - ఇళ్ళ స్థలాలుగా అమ్మడానికి. ఈ ప్రక్రియలో మా బావ సంపాదించే లాభం నోటితో గుణించేది కాదు. నేను కాగితం మీద లెక్క వేసిన దాకా వదల్లేదు. వేసుకో! ఎకరం వెయ్యిచొప్పున కొని గజం రూపాయిన్నర చొప్పున అమ్మితే ఎంతలాభం? మాట వరసకి యాభై ఎకరాలతోనే బిజినెస్ చేశామనుకో - ఎంతయింది?

'ప్లాట్లు వేసి అమ్మేటప్పుడు రోడ్డుకూ వాటికీ వదలాలి గామాలుగా?' అన్నాను.

మా బావ పళ్ళు బిగబట్టి, మూతితో అయిష్టాన్ని సూచించే చప్పుళ్ళు చేస్తూ 'అదంతా వదలినాకనే మనం గజం రూపాయిన్నర చొప్పున గిట్టేట్టు అమ్మామనుకుంటే పోలా? నిక్షేపమంటి ఇళ్ళస్థలాలు గజం రూపాయిన్నర కెవడ్రా ఇస్తాడూ? రెండున్నర అంటే ఎగరేసుకుపోరుట్రా?.... లెక్క ఎంతొచ్చింది?' అన్నాడు బావ.

'గజం రూపాయిచేసుకో, బావా, ఎకరం నాలుగువేలా ఎనిమిదొందల నలభై, యాభై ఎకరాలకు -?'

'ఛీ. ఛీ! అప్రాచ్యుడా! మన లాభమంతా దిగలాగేస్తున్నావు.' అన్నాడు బావ.

'కాస్త తక్కువ అంచనాలోనే ఉంటే మంచిది, బావా.'

'సరే పోనీ, రౌండుగా ఎకరం మీద అయిదువేలు వస్తుందనుకో – చచ్చుధర – అయినా మనలో మనం అనుకోవటానికేం? యాభై ఎకరాలు యాభై అయిదువేలు. అంటే రెండున్నర లక్షలు. ఇంతేనా?'

బావకు నీరసం పుట్టింది.

'రెండున్నర కూడా ఎక్కడిది? యాభై ఎకరాలు ఊరికే రాదుగా? ఎకరం రెండు వేల చొప్పున ఒక లక్ష పోనేపోయె.'

'ఇంకా నయంరోయ్! ఎకరం రెండువేలే! వెయ్యేగదా అనుకున్నాం? పై అర లక్షా పోయిందా. అంటే దిగుబాటు రెండు లక్ష లయిందా?.... మనం మరీ తక్కువ కమ్ముతున్నా మన్నమాటే. ఈపాటి బిజినెస్‌మీద సునాయాసంగా అయిదారు లక్షలు వచ్చేస్తాయి. తెలుసా?'

నాకు తెలీదన్నాను. బావ నా అజ్ఞానానికి జాలిపడ్డాడు. ఆయన అమాయకత్వానికి నేను దడుచుకున్నాను.

మా బావ కలల ఆర్భాటం గురించి పూర్తి దండకం చదవటం నాకిష్టంలేదు. (గ్రంథ విస్తర భీతి). ఒకవేళ చదవదలిచినా నాకు ఆయన బుర్రలో ఉన్న ఆలోచనలన్నీ తెలుసుననుకోను. అంచేత నాకు తెలిసినవాటిలో కొన్ని మాత్రమే చెప్పాను. (అన్నీ చెప్పానులెండి. కాని జిడ్డు పట్టించానని ఎలా ఒప్పుకోను? కొందరు మహా రచయితలు వాళ్ళకు తెలిసిందంతా రాసేస్తారు. నాబోటివాడు తెలిసిందానికన్న ఒక్క పిసరు హెచ్చే రాసినా నమ్రతగా ఉండటం మంచిదిగదా.)

ఉద్యోగం విషయం అడక్కండి. ఎలిమెంటరీ స్కూలు. అందులోనూ పల్లెటూరు. స్కూలుమీద వచ్చే ఆదాయం ముడుపులకు చాలదు.

సంతానయోగం బాగా ఉన్నందున ఎవరూ ఏ పూటా సరిగా తినేవాళ్లు కారని నా అనుమానం. ఏ పిల్ల ఒంటినా చిరగని బట్టలు నేను చూళ్ళేదు. నేను చూడనప్పుడు వాళ్లు మంచి బట్ట కట్టుకునే వాళ్ళనుకుంటే నాకు తృప్తిగానే ఉంటుందిగాని, అనుకోవటం చాతకావటంలేదు.

మా సుందక్క కాపరానికి నేను చెయ్యగలిగిందేమీ కనిపించలేదు. ఏ పండగనో వంకపెట్టి వాళ్ళందర్నీ పిలుచుకొచ్చి, ఓ వారం రోజులుంచుకుని, ఓపికమటుకు బట్టలూ అవీ పెట్టి పంపించడం తప్ప.

మా బావకి బస్తీ జీవితం బాగుండేదికాదు. మా అక్క వారం పదిరోజులు చాకిరీ

తప్పిందని సంతోషించేదే గాని, ఆవిడకూ బస్తీ జీవితం అంతనచ్చదు. పిల్లలు మాత్రం మా ఇంటో ఉన్నన్నాళ్ళూ స్వర్గంలో ఉన్నట్టే ఉండేవాళ్ళు. తిరిగి ఇంటికి బయలు దేరేటప్పుడు పెద్ద పిల్లలు బిక్క మొహాలు వేసేవాళ్ళు.

అందరికన్నా గోపాలం మరీ బిక్క మొహం వేసి, 'అప్పుడేనా? నేను రెండు రోజులుండి వస్తా........ అసలు రానే రాను. మావయ్యగారింటోనే ఉండిపోతా' అని దశలవారీగా తన అసమ్మతిని పెంచుకపోయేవాడు. చివరకు అందరితోబాటు వాడూ వెళ్ళేవాడు.

మా బావ ఆపరేషన్ చేసుకోమన్నప్పుడు మగపిల్లల మెజారిటీ కోసం నిరాకరించాడన్నా నేమోకదూ? అది సాధ్యపడింది కాదు. ఇద్దరాడపిల్లల తరవాత గోపాలం పుట్టాడు. వాడి తరవాత మళ్ళీ ఇద్దరాడపిల్లలు పుట్టి, ఆరోవాడు మగపిల్లవాడు పుట్టాడు. బడ్జెటు లోటు రెట్టింపయింది.

ఆడపిల్లల్ని గురించి నేను చేయగలదేమీ లేదు. చట్టాన్ని ధిక్కరించి వాళ్ళను చిన్నతనంలోనే మా బావ ఎవరికో ముడి పెట్టేస్తాడు.

పెద్దదాన్నీ, రెండోదాన్నీ, అలాగే పదేళ్లు దాటకుండా ముడిపెట్టేసి గుళ్లో పెళ్ళి, గుట్టుచప్పుడు కాకుండా చేశాడు. పెద్దదాని పెళ్ళికి పిలవొచ్చినప్పుడు నాకు శైత్యభారంగా ఉంది.

'ఇంత జబ్బుతో నువు పిల్లల్నేసుకుని ఏం బయలుదేరతావుగాని, చదివింపు లేవైనా ఉంటే ఇప్పుడే నా మొహాన పారెయ్యి. ఆ పురోహితుడిచేత నీ పేరు చెప్పిస్తాను' అన్నాడు బావ. ('ఇంత జలుబుతో' అనే ఓవేళ బావ అన్నాడేమో. నాకు 'జబ్బు' అన్నట్టుగానే వినిపించింది. అందుచేత చిత్రగుప్తుడు నన్ను క్షమించుగాక!)

ఓ యాభై చేతిలోపెట్టి పంపాను. దాంతోనే బావ పెళ్ళి ఖర్చు గడిపేశాడా అని నా అనుమానం.

రెండోపిల్ల పెళ్ళికి పిలవడానికి వచ్చినప్పుడు, 'ఒరే, నువు పెద్దదాని పెళ్ళికీ రాలేదు. ద్వితీయవిఘ్నం చేస్తావా ఏం?' అన్నాడు. కావాలనే అన్నాడో, మాట వరసగా అన్నాడో నాకైతే తెలీదు.

'ఎందుకు చేస్తాను బావా?' అన్నాను. పెళ్ళికి వెళ్ళలేదు. ఈసారి నూరు రూపాయలిచ్చాను.

అసలు సంగతేమిటంటే, అందరికీ ఆడపిల్లలు బరువైతే మా బావ వాళ్ళ బరువును చాలా అవలీలగా దించేసుకునే తెలివితేటలు ప్రదర్శించాడు.

కాని గోపాలంగాడి భారం మహా మోస్తున్నట్టు కనబడ్డాడు. రెండోపిల్ల పెళ్ళికిముందే వాడిమీద దాడి ప్రారంభించాడు.

'వాడిమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. వెధవ నన్ను దగా చేసేట్టున్నాడు. అసలు వాడో అయిదేళ్ళు ముందు పుట్టాలిసింది. అయిదేళ్ళాలస్యంగా పుట్టాడు. నా చేతి కక్కరకు రావటం అయిదేళ్లు ఆలస్యమవుతుందా కాదా? మొదటి సంతానంగా అఘోరిస్తే నాకు సంసారభారం అయిదేళ్లు తగ్గేదిగదా. మాట్లాడవేం?'

'ఏం మాట్లాడను, బావా? మొదటి సంతానం అంత చురుగ్గా ఉండరంటారు.'

'ఏడిసినట్లుంది! ఏడిచి మొహం కడుక్కున్నట్లుంది. నేను మొట్టమొదటి సంతానమే!'

'అంచేతే' ....... అనబోయి మానేశాను.

'వీడు మూడో సంతానమై ఏం అఘోరిస్తున్నాడంటావు? లెక్కలు సున్నా! అన్నీ సున్నాయే! ఈ క్షణం చదివింది మరుక్షణం మరిచిపోతాడు.'

'కొంచెం మతిమరుపేమో?'

'వెధవకి సినిమాపాటలన్నీ గ్యాపకం ఉంటాయే? మతి మరుపుకాదు. మాయ రోగం. చూస్తాను, చూస్తాను. గొడ్లవెనుక పంపిస్తాను.'

మా బావను చూస్తే జాలేసింది. బడిపంతులు కొడుకు చదువులో బండ అంటే కొంచెం పరువు తక్కువే మరి! కొడుక్కు చెప్పలేని చదువు ఊళ్ళో పిల్లలకేం చెబుతారంటారు నలుగురూ. కాని బావ మాటల్లో నాకాట్టే నమ్మకం కుదరలేదు. గోపాలాన్ని చూస్తూనే ఉన్నాను గదా వాడు కాస్త పరధ్యానం మనిషేమోగాని, బండ అన్న అనుమానం నా కెన్నడూ కలగలేదు.

'ఈసారి శలవులకు వాణ్ణి పంపించు. వాడి గొడవేమిటో కాస్త నేను కూడా చూస్తాను' అన్నాను.

గోపాలం ఒంటరిగా మొదటిసారి మా ఇంటికొచ్చేటప్పటికి వాడికి ఏడో ఏడనుకుంటాను. అంతకుముందే మా పెద్ద పిల్లకు సంగీత పాఠాలు మొదలు పెట్టించాం. మా శకుంతల వా డీడుదే. వాడికన్న నలభై రోజులో ఎంతో చిన్న. ఇద్దరికీ ఈసారి భలే దోస్తీ కలిసింది.

'బావ సినిమా పాటలు భలే పాడుతాడు నాన్నా. అచ్చు నాగయ్యల్లేనే పాడతాడు' అన్నది శకుంతల నాతో.

పాడమనటం వ్యవధిగా గోపాలం పాడాడు. వాడి గొంతు, పాడేటప్పుడు, చాలా శ్రావ్యంగా ఉంది. మా అక్కయ్య చిన్నతనంలో తుంగల చలపతి పాటలూ, రామనాథ

శాస్త్రి పాటలూ బాగా పాడేదని నాకు గుర్తుకొచ్చింది. ఇంకేం? గోపాలానికి తల్లి నుంచి పాట అబ్బింది.

సంగీతం మేస్టరు వచ్చి మా అమ్మాయికి పాఠం చెప్పేటప్పుడు గోపాలం దరిదాపుల్లోనే వుండి, దాని పాఠాలన్నీ తానుకూడా ఒప్పజెప్పేవాడు.

నా కనిపించింది – సంగీతం చెప్పిస్తే గోపాలానికి బాగా వస్తుందేమో! వాడు కూడా వాళ్ళ నాన్నల్లేనే ఎలిమెంటరీ స్కూలు నడపాలని ఎక్కడుందీ?

'ఇక్కడే ఉండి చదువుతోపాటు సంగీతం కూడా నేర్చుకుంటా వేమిట్రా?' అని అడిగితే, గోపాలం కళ్ళెగరేసి, 'ఓ!' అన్నాడు.

కాని మా బావ 'చచ్చినా ఆ ఏర్పాటుకు ఒప్పుకో' నన్నాడు.

'వాడికున్న తెగులే సంగీతమైతే. దాన్ని పెంచుతానంటావేమిటి? ఆ సంగీతం పోయిననాడు వాడికి చదువొస్తుంది. పుస్తకం ముందేసుకుని కూనిరాగాలు తీస్తాడు కుంక! పుస్తకం ఏం ఒంటబట్టుతుందీ?' అన్నాడు బావ.

'సరే నీ యిష్టం' అన్నాను.

గోపాలం ఆ వేసవికి మా ఇంటికి మళ్ళీ వచ్చాడు. ఈసారి మా శకుంతల కృతులు పాడేస్తున్నది. మా ఇంట్లో రేడియోకూడా ఏర్పాటయింది.

మా శకుంతల అస్తమానమూ రేడియో హిందీ సినిమా పాటలు వినేది. దానికి – సహజంగా – తాను నేర్చుకునే కృతులకన్న హిందీ సినిమా పాటలే బాగుండేవి. ('సహజంగా' అంటే నా మనస్తత్వాన్నిబట్టి అని అర్థం. నాకు తెలిసినంత వరకూ ఈ మాటను అందరూ ఈ అర్థంతోనే వాడతారు).

కొద్దిరోజులపాటు గోపాలం కూడా సినిమా పాటలు విని ఆనందించాడు. ఆనందించటమే కాదు. రెండు మూడుసార్లు విన్న పాటలను తిరిగిపాడేశాడు. మా శకుంతల ఆశ్చర్యం వర్ణనాతీతం.

'మీ ఇంటో రేడియో ఉందా? నువ్వీ పాటలు చాలా వందలసార్లు విన్నావు కదూ!' అని అది అమాయకంగా గోపాలాన్నడిగింది. వాడు లేదంటే నమ్మలేదు.

అంతకంటే చిత్రమేమంటే రెండు మూడు వారాలు గడిచాక గోపాలం శాస్త్రీయ సంగీతం ముందు సినిమా పాటలేవీ ఆగవని ఖచ్చితంగా శకుంతలతో చెప్పేశాడు. మా పిల్ల పాడే కృతులు వాడికి కంఠతా వచ్చేశాయి.

'అబద్ధం కాదు. చెక్కూ నువు నేర్చుకునే కృతులకన్న ఈ సినిమా పాటలేం గొప్ప?' అన్నాడు గోపాలం. ('శకుంతల'కు అపభ్రంశ రూపం 'చెక్కు.' అటువంటి అపభ్రంశాలు ఫాషను).

ఇక్కడ ఒక్క విషయం ఒప్పేసుకోనివ్వండి. గోపాలం అన్నమాట నాకు వేదవాక్యమై సంగీతంలో నాకుంటూ వచ్చిన అంతంత మాత్రపు అభిరుచిని సరైన దారిలో పెట్టింది. ఈ ఒక్క విషయంలోనూ వాడు నాకు గురువు. ఈ సినిమా పాటలు పుబ్బలో పుట్టి మఖలో మాడిపోతూంటే కృతులు శతాబ్దాల తరబడి ఎందుకు బతికి ఉన్నాయో నాకు తెలిసేటట్టు చేసినవాడు గోపాలం.

వాడు సంగీత విద్వాంసుడు కాకూడదని నిర్ణయించిన వాడి తండ్రి గురించి నా అభిప్రాయం అడక్కండి – నాకన్న పెద్దవాడు.

తిరిగి స్కూళ్ళు తెరిచే సమయానికి మా బావ వాణ్ణి తీసుకుపోవటానికి వచ్చినప్పుడు నేను మళ్ళీ వాడి సంగీతం గురించి ప్రస్తావించి చూశాను.

మా బావ ఔరంగజేబల్లే సంగీతం అనగానే శివమెత్తిపోయాడు.

'బంగారం పారేసుకుంటున్నావు, బావా!' అన్నాను.

'ఆ కాకి బంగారం నాకొద్దు. నాకసలే వాడంటే మండిపోతున్నది. నన్ను మరింత రెచ్చగొట్టకు. నీ మేనల్లుడిలో నీకంత నమ్మకం ఉంటే ఒక పని చెయ్యి. వాడెట్టాగూ నాకక్కరకురాడు. నువు వాణ్ణి నీ ఇచ్ఛానుసారం పాడుచేసుకో. నీ కూతుర్నిచ్చి పెళ్ళిచెయ్. ఇల్లరికం ఉంచుకు తిండిపెట్టు. కట్నం ఇచ్చేదేదో ఇప్పుడే నా మొహాన పారెయ్యి' అన్నాడు బావ.

నాకు పెద్ద ఎసరే పెట్టాడు. తప్పించుకోవటానికి ఒకదానికొకటి అతక్కుండా కారణాలు దొర్లించేశాను. (నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా!)

ఒకటేమిటంటే, శకుంతలను గోపాలానికిస్తే వరహీనమవుతుంది. మా బావ కూతుళ్ళను చూసి అంతా నవ్వుతారు. అదీగాక మేనరికాలు చెయ్యటం చాలా తప్పు. పెట్టుకున్న వరసల ప్రకారం బావామరదళ్ళే అయినా, రక్త సంబంధాన్ని బట్టి అన్నాచెల్లెళ్ళే. అటువంటి వాళ్ళ మధ్య పెళ్ళిళ్ళు ఎంతమాత్రమూ కూడవు. మరోటేమిటంటే, రేపు నేను వాణ్ని గొప్ప సంగీత విద్వాంసుణ్ని చేసి, వాడు రెండుచేతులా వందలూ, వేలూ సంపాదిస్తుంటే బావ ఈ మాట మీద ఉండదు. నా కొడుక్కు ఇల్లరికం ఉండే ఖర్మేమిటంటాడు.

మా బావ పెద్దగానవ్వి, 'ఎందుకింత ఉపన్యాసం? వాడు సంగీతం నేర్చి బిచ్చం కూడా ఎత్తుకోలేడని నీకూ తెలుసు. ఆ మాట అఘోరించరాదూ?' అన్నాడు.

ఆ తరవాత కొద్దిరోజులకే గోపాలం వ్యవహారం నా చెయ్యీ, మా బావ చెయ్యీ కూడా దాటిపోయింది. గోపాలం ఫస్టు ఫారం అందరికన్నా పెద్ద రాంకులో తప్పాట్ట. మా

బావ వాణ్ని స్పృహతప్పి పోయేట్టు కొట్టాట్ట. గోపాలం ఎవరితోనూ చెప్పకుండా ఎక్కడికో లేచిపోయాట్ట.

'నేను నాన్న కన్న ఎక్కువ సంపాదించినదాకా ఉత్తరం కూడా రాయను' అని ఆ పన్నెండేళ్ళ వెధవ కార్డు రాసినదాకా అక్కయ్య అన్నంకూడా తినకుండా ఏడుస్తూ కూర్చుందిట.

గోపాలం ఇంటికి రాలేదన్న మాటేగాని వాడి సంగతులు అప్పుడప్పుడూ తెలుస్తూనే ఉన్నాయి. వాడేదో నాటక సమాజంలో చేరాడని విన్నాను. ఆ నాటక సమాజంలో చేరి వాడు చేసిన ఘనకార్యం హోటలునుంచి టిఫిన్లు తీసుకురావటమూ, అరవ చాకిరీ చెయ్యటమూ మాత్రమేనని తరవాత తెలిసిందనుకోండి. వాడు ఎంగిలి పళ్ళాలు కడిగినా నాకేమీ నామోషీ లేదు. అంత చిన్నతనంలో వాణ్ని వాడు పోషించుకోగలిగినందుకు సంతోషించాను.

ఈ దేశంలో కాక మరే దేశంలోనైనా వాడి వంటి కుర్రాడికి మంచి అవకాశా లుండేవేమోనని అనుమానం నన్ను వదలలేదు. ఏమో? నాకు మటుకేం తెలుసు? ఇంతకన్న కూడా బడుగు దేశాలుండవచ్చు! అక్కడి కుర్రాళ్ళ జీవితం ఇంతకన్న కూడా దైవాధీనం కావచ్చు.

అయిదారేళ్ళ క్రితం మా గోపాలం మద్రాసు చేరినట్టు తెలిసింది. సినిమా ఛాన్సులకోసం చూస్తున్నాడని ఎవరో చూచాయగా అన్నారు.

మా అమ్మాయి కాలేజీలో చేరుతూనే సంగీతం మానేసింది. నేర్చుకున్నంత వరకూ బాగానే పాడుతుంది.

ఒకనాడది రేడియో వింటూ, 'ఆ గొంతు బావదల్లే ఉంది' అన్నది. ఏదో పాటల నాటకం. నాటకం చివర చెప్పిన పేర్లలో వి.గోపాలరావు అనే పేరుకూడా ఉంది. మా మేనల్లుడే అయుండాలి. నేను గొంతు ఏమాత్రం గుర్తించలేదు. కాని మా శకుంతల గుర్తించింది.

ఆ తరవాత అప్పుడప్పుడూ మద్రాసు రేడియో కేంద్రం పాటల నాటకాల్లో వాడి గొంతు వింటూ వచ్చాం.

రెండేళ్ళ క్రితం మా శకుంతల పెళ్ళి అయినప్పుడు గోపాలం ఆకాశం నుంచి ఊడిపడ్డట్టుగా దిగాడు. మనిషి పూర్తిగా మారిపోయాడు.

రేడియోలో వాడు పాడినప్పుడల్లా విధిగా వింటున్నామని చెప్పాం. (మేం విన్నది మొత్తం మూడుసార్లే. కానిఅలా అంటే వాడు సంతోషిస్తాడని!)

'అవునుగాని, గోపాలం, శాస్త్రీయ సంగీతం సాధన చేశావా?' అన్నాను.

'ఎందుకొచ్చిన శాస్త్రీయ సంగీతంలే మామయ్యా? ఎవడిక్కావాలది?'

'ఇంతకూ నీవు మద్రాసులో ఏంచేస్తున్నావు? ఎట్లా గడుస్తున్నది' అన్నాను.

'ఒక మ్యూజిక్ డైరెక్టరు దగ్గిర అసిస్టెంటుగా పనిచేస్తున్నాను. ఎప్పుడన్నా రేడియోవాళ్ళు పిలుస్తారు. ఫరవాలేదు. ఒకటి రెండు డబ్బింగు పిక్చర్ల ఛాన్సు తగిలింది. కాస్త డబ్బు బాంకులో వేసుకున్నాను కూడా.' అన్నాడు గోపాలం.

డబ్బు బాంకులో వేసుకున్నానంటే రెండొందలో, మూడొందలో అనుకున్నాను. కాని కిందటేడు గోపాలం చేసిన ఫీట్లు తెలియవచ్చాయి. పట్నానికి పదిహేను మైళ్ళ దూరంలో గోపాలమూ, ఇంకోడూ కలిసి ఆరెకరాలు కొని, ప్లాట్లు వేసి ఇళ్ళస్థలాలకింద అమ్మి, చెరొక యాభైవేలు చేసుకున్నారట. చెరో వెయ్యి గజాలు తమ సొంతానికి ఉంచుకున్నారట. అక్కడికి అయిదారు మైళ్ళ దూరాన గోపాలం పదెకరాలు కొని, బావి తవ్వించి, పంపుసెట్టు పెట్టి, సమస్తమైన కూరలూ పువ్వులూ పండించి, నెలకో అయిదారు వందలు సంపాదిస్తున్నాడు. వాడికి పెళ్ళి అయింది. ఒక ఆడపిల్ల కూడానూ. తన సొంత స్థలంలోనే మంచి ఇల్లూ, తోటా ఏర్పాటు చేసుకున్నాడు. ఇప్పుడు సినిమా గొడవ లేమీలేవు. ఇటీవలనే తాంబరానికి మూడుమైళ్ళ దూరాన మరో పదెకరాలు కొని, ఇళ్ళ స్థలాలుగా అమ్ముతున్నాడని తెలిసింది. మహాబలిపురం వెళ్ళేదారిలో కూడా ఏవో స్థలాలమ్ముతున్నారనీ, అందులో వాడికో భాగం ఉందనీ వింటున్నా. కనక అయ్యా – దైవాధీనపు జీవితం!

***ముద్రణ: దీపావళి ప్రత్యేక సంచిక, 1966***
***యువ బుక్ డిపో, మద్రాస్***